క్లుప్తంగా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జెడ్పీటీసీ



జగన్‌మోహన్‌రెడ్డికి శుభలేఖ అందజేస్తున్న జెడ్పీటీసీ

పీసీపల్లి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పీసీపల్లి జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం ఓకేరెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 16న జరగనున్న వారి చిన్న కుమారుడు వివాహ శుభలేఖను జగన్ మోహన్‌రెడ్డికి అందజేశారు. వారితో పాటు ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి ఉన్నారు.

15 లోగా దరఖాస్తు చేసుకోవాలి

హనుమంతునిపాడు: స్థానిక కేజీబీవీ పాఠశాలలో వాచ్ ఉమెన్ పోస్టుకు అర్హులు ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ జి.పెద్దిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మండల నివాసులై, 7వ తరగతి పాసై ఉండాలన్నారు. వయసు 18 నుంచి 42 ఏళ్ల ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మండల విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై కె.మాధవరావు అన్నారు. స్థానిక హాజీపురం అడ్డరోడ్డు, కంభం కనిగిరి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు విధిగా ధ్రువీకరణ పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు.

కోదండరామస్వామి ఆలయానికి భూమిపూజ



కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అర్చకులు, భక్తులు

పామూరు: మండలంలోని తిరగలదిన్నెలో నూతనంగా నిర్మించనున్న కోదండరామస్వామి ఆలయానికి బుధవారం ప్రధాన అర్చకులు కురిమేటి నరేంద్ర ఆధ్వర్యంలో రావినూతల రమేష్, జొన్నాబొట్ల తేజ తదితరులు వేదమంత్రాలతో భూమిపూజ చేశారు. తొలుత శుద్ధి పుణ్యాహావాచనం, గర్తరిపూజ, శిలాపూజ, మత్స్యాయంత్ర పూజ, మహాగణపతి హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు

హనుమంతునిపాడు: పంచాయతీ అభివృద్ధి, అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లకు రెండు రోజుల శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పంచాయతీలో నిర్వహించాల్సిన అభివృద్ధి పనులు, ముందస్తు అభివృద్ధి పనుల ప్రణాళిక తయారీపై చేయాల్సిన పనులు, సర్పంచ్‌లు, వార్డుసభ్యులు బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈఓఆర్డీ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు

కనిగిరి రూరల్: స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానంలో ఈ నెల 12న 106వ మహా సమాధి (పుణ్య తిథి)కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు తెలిపారు. 10వ తేదీ గురువారం నుంచి 12 తేదీ శనివారం వరకు ప్రతి రోజు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, చండీ హోమం, సహస్రనామ కుంకుమార్చన జరుగుతాయన్నారు. దుర్గాష్టమి, మహార్నవమి సందర్భంగా భిక్షా కార్యక్రమం పట్టణ పుర వీధుల్లో జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి శాశ్వత ఉభయ దాతలచే సామూహిక పూజలు జరుగుతాయని, మధ్యాహ్నం సాయిగాన లహరి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. మధ్యాహ్నం 2:30 గంటల తర్వాత బాబావారి పుణ్యతిథి కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

‘పొలం పిలుస్తోంది’
అధికారులు మాత్రం రారు..!



పొలం పిలుస్తోంది సభ వేదికపై ఏడీఏ తప్ప కన్పించని ఇతర శాఖల అధికారులు



నామ్‌కే వాస్తేగా పొలం పిలుస్తోంది కార్యక్రమం

- తూతుమంత్రంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం
- కన్పించని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు
- టీడీపీ సానుభూతిపరుల పొలాల్లో క్షేత్ర స్థాయి సందర్శనతో మమ
- కన్పించని ప్రచార కరపత్రాలు

కనిగిరి రూరల్:

రైతులకు పంటల సాగులో ఉన్న అనుమానాలకు నివృత్తి కల్పించి మెరైన దిగుబడులు సాధించేలా ఎంతో ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమం పొలంపిలుస్తోంది. ఈ కార్యక్రమ ఉద్దేశం ఉన్నత లక్ష్యమైనా..అధికారులు నిర్లక్ష్యంతో ఈ లక్ష్యం నీరుగారిపోయింది. మొక్కుబడిగా కార్యక్రమాన్ని నిర్వహించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. అసలు వ్యవసాయ శాఖల అధికారులెవ్వరూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం లేదంటే ఈ పొలంపిలుస్తోంది కార్యక్రమం ఏ విధంగా నిర్వహిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

ఇదీ ఉద్దేశం..

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగు వ్యయం తగ్గింపు, మెరుగైన సాగు పద్ధతులు, మేలైన రకాల వ్యవసాయ ఉత్పత్తుల వంగడాలపై అవగాహన, ఉత్తమ సాగు పద్ధతులపై అవగాహన, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రైతులకు ఆదాయం పెంచేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. రైతులు– శాస్త్రవేత్తలతో నేరుగా ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతులకు ఉన్న సందేహాలను పరిష్కరించాలి. ఇందుకు ప్రతి మంగళ, బుధవారాల్లో ఉదయం 8: 30గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో క్షేత్ర సందర్శన(పొలం బాట), పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి నాల్గు గంటల వరకు రైతులకు అవగాహన కార్యక్రమాలు కల్పించాలి. కానీ ఇవన్నీ క్షేత్ర స్థాయిలో అమలు జరగడం లేదు. ఇతర శాఖల అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమానికి డుమ్మాకొడుతూ పథక ఉద్దేశాన్ని నీరుగారుస్తున్నారు. పాల్గొన్న అధికారులు కూడా ముందుగానే నిర్ణయించిన మేరకు కూటమి నేతల సానుభూతిపరుల పొలాల్లోకి వెళ్లి ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లిపోతున్నారు. వ్యవసాయాధికారులు అక్కడక్కడ ఒకరిద్దరు అధికారులు తప్ప ఎక్కడా అనుబంధ శాఖల అధికారు ఆచూకీ లేదు.

ప్రతి రోజు ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తున్నాం:

పొలంపిలుస్తోంది కార్యక్రమంకు కచ్చితంగా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులంతా హాజరు కావాలి. కానీ కొన్ని శాఖల అధికారులు హాజరు కావాడం లేదు. బుధవారం పీసీపల్లి మండలం గుదేవారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో తాను ఒక్కడినే మాట్లాడిల్సి వచ్చింది. మిగతా మండలాల్లో కూడా చాల చోట్ల ఇతర శాఖల అధికారులు ఒకరిద్దరు మాత్రమే వచ్చినట్లు తెలిసింది. అయా శాఖల అధికారులు బాధ్యతగా హాజరు కావాలి. పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు హాజరు కాని శాఖల అధికారుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తున్నా.

ఈ వెంకట రమణ, ఏడీఏ

పత్తా లేని అధికారులు..

పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు వ్యవసాయ శాఖ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉండగా... దాని అనుబంధ శాఖల అధికారులు కూడా తప్పక పాల్గొనాలి. వ్యవసాయ శాఖతో పాటు, ఆత్మ, ఏపీ సీఎస్ఎఫ్, ఉద్యాన శాఖ, సెరీ కల్చర్, పశువర్ధక శాఖ, ఏపీ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్, కో ఆపరేటివ్ ఫెడరేషన్, మత్స్య శాఖ, వ్యవసాయ మార్కెటింగ్‌తో పాటు కెనాల్స్, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయం ఇలా సుమారు 9 నుంచి 10 శాఖల అధికారులు భాగస్వామ్యులుగా హాజరుకావాల్సి ఉంది, అయితే అక్కడక్కడ ఒకటి రెండు మండలాల్లో వ్యవసాయ అధికారులతో పాటు, ఉద్యాన శాఖ, పశువర్ధక శాఖ అధికారులు కన్పిస్తూ... ఫ్లెక్సీలు పట్టుకుని, ఫొటోలు దిగి మమ అనిపిస్తున్నారు.

అల్లాడుతున్న రైతులు


కనిగిరి నియోజకవర్గంలో కనిగిరి, పామూరు, పీసీపల్లి, సీఎస్‌పురం, వెలిగండ్ల, హెచ్‌ఎం పాడు మండలాలున్నాయి. కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 20,928 హెక్టార్లు. అయితే ఇప్పటికి 65 శాతానికి పైగా ఖరీఫ్ పైర్లు వేశారు. వీటిలో అత్యధికంగా కంది పైరు సుమారు 8 వేల హెక్టార్ల వరకు సాగు చేసినట్లు అంచనా. వరి, పొగాకు, సజ్జ, ఆముదాలు, పొద్దు తిరుగుడు తదితర పైర్లు సాగులో ఉన్నాయి. ఇవి గాక ఉద్యానవన పంటలు నిమ్మ, బత్తాయి, దానిమ్మ తదితర రకాలు వేశారు. అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులు ఇలా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు తమ పంట పొలాలను కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచి సలహాలు, సూచనలు ఇచ్చి.. రైతులకు అండగా నిలబడి భరోసా కల్పించాల్సిన వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు కుంటి సాకులతో ఎగనామం పెడుతున్నారు.



భైరవకోనలో సరస్వతీ దేవిగా త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు



సీఎస్‌పురంలో సరస్వతీ దేవిగా పెద్దమ్మ అమ్మవారు



సరస్వతీదేవిగా వాసవీమాత ఉత్సవ విగ్రహమూర్తి

సరస్వతీ నమస్తుభ్యం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పామూరు: సరస్వతీదేవిగా మహాలక్ష్మి



పెదయిర్లపాడులో



వల్లూరులో సరస్వతి దేవిగా వల్లూరమ్మ



నాగిరెడ్డిపాలెంలో సరస్వతిదేవిగా..



నేతివారిపాలెంలో సరస్వతిదేవిగా..



పాకల శివాలయంలో సరస్వతీదేవిగా..

ప్రజా సమస్యలపై పాలకులు దృష్టి సారించాలి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులార్పిస్తున్న సీపీఎం నేతలు

కొండపి: కేంద్ర, రాష్ట్ర పాలకులు ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం కాదని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. సీపీఎం పెరిదేపి గ్రామ శాఖ మహాసభ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా హామీలు అమలు చేయకుండా సమస్యలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంజాల ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. సీపీఎం గ్రామ శాఖ మహాసభల ప్రారంభ సూచకంగా సీనియర్ నాయకుడు అంకలకుర్తి బ్రహ్మయ్య పతాకావిష్కరణ చేశారు. సీతారామ్ ఏచూరి, ముప్పరాజు శేషయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు శ్రీనివాసులు, రామాదేవి, రమేష్, కేజీ మస్తాన్, చిన్న బ్రహ్మయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో డార్క్ డీల్స్ సినిమా షూటింగ్ ప్రారంభం

వెలిగండ్ల: స్థానిక కాశీనాయన ఆశ్రమంలో బుధవారం సమీరా ఫిలిమ్స్ ప్రొడక్షన్ వారి ఆధ్వర్యంలో డార్క్ డీల్స్ సినిమా షూటింగ్ ప్రారంభించారు. డైరెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన వెలిగండ్లలో సినిమా షూటింగ్‌కు అనుకూలమైన ప్రదేశాలు ఉన్నాయన్నారు. యువత డ్రగ్స్ బానిసలై వారి జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటున్నారని, దాని వల్ల వారికి కలిగే పర్యవసనాల గురించి తెలియజేసేందుకే ఈ సినిమాను తీస్తున్నట్లు తెలిపారు. కెమెరా మెన్ సీహెచ్ సూర్య, చిత్ర బృందం పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి



వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 11వ వార్డులోని సూరా పాపిరెడ్డి కాలనీలో ఆయన పర్యటించారు. స్థానికులు రోడ్లు, కాలువలు, నీరు, పారిశుధ్య సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన చైర్మన్ తక్షణ చర్యగా పిచ్చి చెట్ల తొలగింపు చర్యలకు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, శానటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో మోస్తారు వర్షం



టంగుటూరులో జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద వర్షంనీరు

టంగుటూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం మోస్తారు వర్షం కురిసింది. వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. స్థానిక కొండపి ఫ్లైఓవర్ కింద, బొమ్మల సెంటర్‌లో వర్షం నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అలాగే జయవరం, రెవెన్యూ కార్యాలయం వెనుక ఉన్న పోతుల చెంచయ్య కాలనీలోకి వర్షం నీరు చేరడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

ఆలయ పునర్ నిర్మాణ పూజలు



ప్రత్యేక పూజల్లో దేవకి వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ నాయకులు

కనిగిరి రూరల్: పట్టణంలోని రామాలయం వీధిలో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన పునర్ నిర్మాణ పూజలు బుధవారం ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూల నక్షత్రం సందర్భంగా గర్భాలయం , అంతరాలయాల దర్వాజాలను నిలబెట్టు కార్యక్రమాలను వేద పండితులతో నిర్వహించారు. తొలుత భక్తులు ఆలయ స్తంబాల, శిలల పూజలన వాసవీ మాత కీర్తనలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ గౌరవాధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు దేవకి శ్రీనివాసులు, కమిటీ నాయకులు కొలిపర్తి వెంకటస్వామి, బచ్చు వెంకట రమేష్, నార్లపాటి మల్లికార్జున, కోటా ఏడుకొండలు, పెద్ద శెట్టి వెలుగూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కనిగిరిలో ఆపరేషన్ స్వేచ్ఛ

కనిగిరి రూరల్: ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం కనిగిరిలో ఆపరేషన్ స్వేచ్ఛా కార్యక్రమం పోలీస్, రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్, ఆరోగ్య, నాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐ ఎస్‌కే ఖాజావలి మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. బడి ఈడు పిల్లలతో వెట్టి చాకిరి చేయించినా వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకున్నా.. పనికి పంపించినా నేరమన్నారు. అనంతరం ఆపరేషన్ స్వేచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీఓ పి. సరోజని, డాక్టర్ సుబ్బయ్య, శ్యామ్యూల్ గెర్షోమ్, మంద్రు రమేష్, నవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దసరా బ్రహ్మోత్సవాలు



నందనమారెళ్లలోని గుడిలో ప్రత్యేక పూజలు

కనిగిరి రూరల్: దసరా బ్రహ్మోత్సవాలు కనిగిరిలో వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో కొలువు తీరిన దేవతా మూర్తులకు బుధవారం విశిష్ట పూజలు చేశారు. అమ్మవారు వివిధ రూపాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి ప్రత్యేక పూజలు అందుకున్నారు. కనక దుర్గమ్మ గుడి, అంకాళమ్మ గుడి, మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, దొంతులమ్మ గుడి, సాయిబాబా గుడి, లక్ష్మీ నరసింహ స్వామి, శివనగర్ కాలనీలోని దత్త పీఠంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గార్లపేట రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, కల్యాణోత్సవాలు జరిగాయి. నందనమారెళ్లలోని బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో చండీహోమం, రుద్రాభిషేకాలు చేశారు.

మస్తానమ్మకు దద్దాల పరామర్శ



మస్తానమ్మను పరామర్శిస్తున్న దద్దాల

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని గణేశునిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త మస్తానమ్మ ఇటీవల జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఈసందర్భంగా బుధవారం వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ స్థానిక నాయకులతో కలిసి మస్తానమ్మ ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించి ఆరోగ్యంపై చర్చించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, బైరెడ్డి తిరుపతి రెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, మేడబోయిన వెలుగొండయ్య, బక్కా దేవదానం, భాగ్యరాజు, ఆదినారాయణరెడ్డి, స్వర్ణ ఏడుకొండలు, వాకమళ్ల రాజశేఖర్, గంజి రవీంద్రరెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

భైరవకోనలో దద్దాల పూజలు



భైరవకోన ఆలయాల్లో పూజలు చేస్తున్న డాక్టర్ దద్దాల



చండీహోమంలో పాల్గొన్న దద్దాల

సీఎస్‌పురం(పామూరు): దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం మండలంలోని భైరవకోనలో జరుగుతున్న విశిష్ట పూజల్లో బుధవారం వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మొదట త్రిముఖ దుర్గాదేవి, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం చండీహోమంలో నిర్వహించారు. సమీపంలోని జలపాతాన్ని స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఆలయ అర్చకులు డాక్టర్ దద్దాలకు వేద ఆశీర్వచనంచేసి శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, బైరెడ్డి తిరుపతిరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, మేడబోయిన వెలుగొండయ్య, బక్కా దేవదానం, భాగ్యరాజు, ఆదినారాయణరెడ్డి, స్వర్ణ ఏడుకొండలు, వాకమళ్ల రాజశేఖర్, గంజి రవీంద్రరెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



నందనవనంలో నిర్వహిస్తున్న పొలంబడి



బొట్లగూడూరులో రైతులకు సూచనలిస్తున్న ఏఓ రాధ



చిమటలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి వెంకటేష్

పామూరు: పంటలను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖాధికారి కంచం రాధ, ఉద్యానవన శాఖాధికారి కె.కుసుమ అన్నారు. మండలంలోని బొట్లగూడూరు, కోడిగుంపల గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో మెళకువలు వివరించారు. అనంతరం కందిపైరు, బత్తాయి తోటలను పరిశీలించి వాటిని ఆశించే తెగుళ్ల గురించి వివరించి తగు జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలు, మందుల వివరాలు వివరించారు. వీఏఏ హరికృష్ణ, ఎంపీఈఓ శివానీ, కొల్లా క్రిష్ణయ్య, అడుసుమల్లి ప్రభాకర్, రాజా, మాల్యాద్రి, రైతులు పాల్గొన్నారు.

మర్రిపూడి: రైతులు పంట మార్పిడి విధానాన్ని అలవర్చుకోవాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ తెలిపారు. మండలంలోని చిమట, రామాయపాలెం గ్రామాల్లో పొలంబడి పిలుస్తుంది నిర్వహించారు. పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ పంట మార్పిడితో చీడపీడల నివారణతో పాటు పంటలు అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు మహేంద్రాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ సాధ్యమని ఏఓ కె.రమణ అన్నారు. ముప్పాళ్లపాడులో బధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. సజ్జ, వరి, పండ్ల తోటల సాగు, నిమ్మ తోటలు పరిశీలించారు. వాటికి సోకిన తెగుళ్ల పరిశీలించారు. విత్తన శుద్ధితోనే తెగుళ్ల నివారణ చేయవచ్చన్నారు. హెచ్‌ఎం ఎం. అంజలీబాయి పండ్ల తోటలకు ఆశించే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏలు దేవిరెడ్డి శారద, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరు: కూరగాయలు సాగు చేసే రైతులకు నారు ఉచితంగా కుప్పం నుంచి సరఫరా చేస్తామని ఉద్యాన శాఖాధికారి తేజ అన్నారు. మండలంలోని వాసేపల్లిపాడు, మల్లవరప్పాడు గ్రామ పంచాయతీల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ శనగలో విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తూ దాని ఆవశ్యకతను వివరించారు. వరిపైరుపు తొలి దశలో ఆశించే పురుగు ఉధృతి నివారణ గురించి తెలియజేశారు.

ముగిసిన పొగాకు వేలం



వేలం ముగింపు ఉత్సవాల్లో నిర్వహణాధికారి శ్రీనివాసరావు, వ్యాపారులు, రైతులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో 2023–24 పంట కాలానికి పొగాకు అమ్మకాలు బుధవారంతో ముగిసినట్లు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 152 రోజులు నిర్వహించిన వేలంలో 16 మిలియన్ల పొగాకును కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.279 సగటు ధర లభించిందని తెలిపారు. వేలంలో 53 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సూర, ముక్కకి సంబంధించి బుధవారం నిర్వహించిన వేలంలో 441 బేళ్ల కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. జువ్విగుంట, అయ్యావారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం, ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, దాదానాయుడుపాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి, ఎస్ఎస్ కండ్రిక, పెట్లూరు, వర్ధినేనినివారిపాలెం, జగ్గరాజుపాలెం, అయ్యపురాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్దకండ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు 688 బేళ్లను తీసుకురాగా 441 బేళ్లను కొనుగోలు చేసి 247 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.136, కనిష్ట ధర రూ.40, సరాసరి రూ.61.64 పలికింది. వేలంలో ఆరుగురు వ్యాపారులు పాల్గొన్నారు.